క్లుప్తంగా

సొంత ఖర్చుతో రోడ్డుపై గోతుల పూడ్చివేత



పొక్లెయిన్ సాయంతో నిడదవోలు - నరసాపురం రోడ్డుపై గోతులు పూడ్చివేత

పెరవలి: నిడదవోలు–నరసాపురం ఆర్ అండ్ బీ రహదారి అడుగుకో గొయ్యి చొప్పున అధ్వానంగా తయారైంది. రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు దుస్థితిని గమనించిన మండలంలోని తీపర్రు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి ప్రసాద్ తన సొంత ఖర్చుతో ఆ గోతులను పూడ్చించారు. బాగా గోతులు ఉన్న చోట గ్రావెల్ వేయించారు. గత ప్రభుత్వంలో నిర్మించిన ఈ రోడ్డు నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడిపడితే అక్కడ గోతులు పడి ప్రమాదకరంగా మారిన విషయం తెలిసిందే.

తీయని పూడికకు బిల్లులపై విచారణ జరపాలి

నిడదవోలు: పట్టణంలోని డ్రైన్‌ల నుంచి పూడిక తీయకుండానే మున్సిపల్ అధికారులు బిల్లులు పెట్టుకున్నారంటూ గత నెల 31న నిర్వహించిన నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలువురు సభ్యులు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై మంగళవారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2023–24 సంవత్సరంలో డ్రైన్లలో పూడిక తీత పనులపై సమగ్ర విచారణ జరిపి, పూర్తి నివేదిక ఇవ్వాలని రాజమహేంద్రవరం పబ్లిక్ హెల్త్ ఎస్ఈకు లేఖ ద్వారా కోరామని మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి తెలిపారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి



వారోత్సవాల్లో దమ్మెన్ను సర్పంచ్ సత్యనారాయణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్

ఉండ్రాజవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని దమ్మెన్ను సర్పంచ్ గురజాల సత్యనారాయణ సూచించారు. మండలంలోని దమ్మెన్ను–2 అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో మంగళవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ టీఎల్ బాల సరస్వతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు ఆటపాటలతో పాటు విద్య నేర్చుకోవడం వల్ల వారికి ఐక్యూ పవర్ పెరుగుతుందన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన గర్భిణులు, బాలింతలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు గల ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బన్ను, కామేష్, వి.శ్రీనివాసు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ కల్పిస్తాం

కడియం: మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ ఎంవీఎస్ మూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మిగులు పువ్వుల నుంచి అగరబత్తీల తయారీ శిక్షణను మంగళవారం ఆయన డీఎఫ్ఆర్‌సీ సీనియర్ శాస్త్రవేత్త డీవీఎస్ రాజుతో కలిసి పరిశీలించారు. పీడీ మూర్తి మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(ఆర్ఎస్ఈటీఐ) సంయుక్తంగా శిక్షణ ఇస్తున్నాయన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్లోరీకల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.భారతీశర్మ, యువన్ వెండర్ రవీందర్‌పరస్‌లు ఆన్‌లైన్‌లో మహిళలకు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ జరుగుతున్న తీరును మహిళలను అడిగి తెలుసుకున్నారు.

ఆఫీస్ సబార్డినేట్‌కు గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తలుపులమ్మ

రాజమహేంద్రవరం రూరల్: పింఛన్ల పంపిణీకి వెళుతూ ఒక ప్రభుత్వ ఉద్యోగిని గాయాలపాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ధవళేశ్వరం పంచాయతీ ఉద్యోగవర్గాలు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 31న ధవళేశ్వరం గ్రామపంచాయతీ ఆఫీస్ సబార్డినేట్ సోమాదుల తలుపులమ్మకు గ్రామ సచివాలయం–5 పరిధిలో పింఛన్లు పంపిణీ చేసే బాధ్యతను అప్పగించారు. ఆ రోజు తెల్లవారుజామున తలుపులమ్మ తన వాహనంపై పింఛన్లు ఇచ్చేందుకు వర్షంలో బయలుదేరింది. క్వారీ కెనాల్ రోడ్డులో ఆమె వాహనం గోతిలో పడడంతో అదుపుతప్పి కింద పడిపోయింది. దీంతో తలుపులమ్మ ఎడమచేయి విరిగిపోయింది. దీంతో ఆమెను రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చేతికి శస్త్రచికిత్స చేశారు. పింఛన్ల పంపిణీ విషయంలో ఉన్నతాధికారుల ఒత్తిళ్ల కారణంగానే దిగువ స్థాయి ఉద్యోగులు ఆందోళనకు గురై ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఉద్యోగస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాగని సచివాలయ నిర్మాణాలు

- శిథిలమైన పంచాయతీ భవనాల్లో సిబ్బంది విధులు
- నిర్మాణాలకు ముందుకు రాని కాంట్రాక్టర్లు



దేవరపల్లి మండలం బందపురంలో అసంపూర్తిగా ఉన్న ఆర్‌బీకే భవనం



బందపురంలో వినియోగంలోకి రాని భవనం

దేవరపల్లి: నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన గ్రామ సచివాలయ, రైతుభరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు అన్న చందంగా గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాల జాప్యానికి పలు కారణాలున్నాయి. అవి.. సకాలంలో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించక పోవడం, నిర్మాణాల్లో జాప్యం, చేసిన మేర పనులకు సకాలంలో బిల్లులు చెల్లించక పోవడం మొదలైనవి. ఈ కారణాలతో గోపాలపురం నియోజకవర్గంలో చేపట్టిన భవనాల నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదు. మరో మార్గం లేక శిథిలావస్థకు చేరుకున్న గ్రామ పంచాయతీ భవనాల్లోనే ఉద్యోగులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కాలం చెల్లిన భవనాల శ్లాబులు బీటలు తీసి నీరు కారుతుండడంతో రికార్డులు, కంప్యూటర్లు తడిసి ముద్దవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. నియోజకవర్గంలో పంచాయతీ భవనాల నిర్మాణం జరిగి 40 ఏళ్లు పైబడడంతో అవి జీర్ణావస్థకు చేరుకున్నాయి. అదీగాక ఈ భవనాలు ఇరుకుగా ఉండడంతో విధులు నిర్వహించేందుకు సిబ్బంది అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రామ పంచాయతీ భవనాల దుస్థితిని గమనించిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రతి రెండు వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేసి, ఒక్కో సచివాయంలో 10 మంది ఉద్యోగులను నియమించారు. వారంతా సక్రమంగా విధులు నిర్వహించేందుకు గ్రామ సచివాలయ, రైతుభరోసా కేంద్రాల, వెల్‌నెస్ కేంద్రాల భవనాల నిర్మాణం చేపట్టారు. ఒక్కో గ్రామ సచివాలయ భవనానికి రూ.43.6 లక్షలు, ఆర్‌బీకే భవనానికి రూ.23.12 లక్షలు, వెల్ నెట్ సెంటర్ భవనానికి రూ. 20.8 లక్షల చొప్పున నాటి ప్రభుత్వం మంజూరు చేసింది.

మూడు మండలాల్లో 59 భవనాలు

తూర్పుగోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో 59 గ్రామ సచివాలయాల పరిధిలో భవనాల నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటి వరకూ 48 గ్రామ సచివాలయ, 46 ఆర్‌బీకే, 29 వెల్‌నెస్ కేంద్రాల భవనాల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. దేవరపల్లి మండలంలోని బందపురం, చిన్నాయగూడెం, యాదవోలు, లక్ష్మీపురం, దుద్దుకూరు, గౌరీపట్నం గ్రామాల్లో భవనాల నిర్మాణాలు పూర్తి కావలసి ఉంది. బందపురంలోని భవనాలు ముళ్లపొదల మధ్య ఉన్నాయి. కాంట్రాక్టర్ జాప్యం వల్ల పనులు జరగలేదని అధికారులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ భవనాల నిర్మాణాలను పూర్తిగా పక్కన పెట్టిందనే విమర్శలు వస్తున్నాయి.



దేవరపల్లి మండలం బందపురంలో అందుబాటులోకి రాని వెల్ నెస్ కేంద్రం

నిర్మాణాలు నిలిచిపోయాయి



నియోజకవర్గంలో సచివాలయ భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. పలు గ్రామాల్లో కాంట్రాక్టర్లను మార్చారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తాం. నియోజకవర్గంలో 11 గ్రామ సచివాలయ భవనాలు నిర్మాణాలు పూర్తికావలసి ఉంది. మండలాల వారీగా దేవరపల్లిలో 3, గోపాలపురంలో 8 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం పూర్తికావాలి. 13 ఆర్‌బీకేలు, 29 వెల్‌నెస్ సెంటర్ల భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

– కె. బాలకృష్ణ, డీఈఈ, పంచాయతీరాజ్, గోపాలపురం

గౌరవ వేతనాల కోసం బీఎల్‌వోల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎల్‌ఓలు

నల్లజర్ల: మూడేళ్లుగా బకాయి పడిన తమ గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ మండలంలోని బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓ) మంగళవారం నల్లజర్లలో తహసీల్దార్ కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. కాగా వారంతా వీఆర్వోలు. రెగ్యులర్ విధులతోపాటు ఎన్నికల నిర్వహణ బాధ్యతలను కూడా ఎన్నికల సంఘం వారికి అప్పగించింది. అందుకు కొంత గౌరవ వేతనం చెల్లించాలి. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందు నుంచే తమతో కచ్చితమైన ఓటర్ల జాబితాలు తయారు చేయించుకున్నప్పటికీ, గౌరవ వేతనాల చెల్లింపులో మాత్రం మొండి చేయి చూపారని వారు పేర్కొన్నారు. మండలంలో 66 మంది బీఎల్వోలు ఉన్నారని ఒక్కక్కరికి నెలకు రూ.500 చొప్పున రూ.18 వేలు చెల్లించాల్సి ఉందన్నారు. దీనిపై తహసీల్దార్ కృష్ణారావు మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామన్నారు.

ప్రశాంతంగా చవితి వేడుకలు జరుపుకోవాలి

- నిడదవోలు సీఐ శ్రీనివాసరావు
- ఆలయ కమిటీ సభ్యలకు అవగాహన



నిడదవోలు సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు



నిర్వాహకులతో మాట్లాడుతున్న చాగల్లు ఎస్సై నరేంద్ర

నిడదవోలు: ప్రజలందరూ కలిసిమెలసి, ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని నిడదవోలు సీఐ వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక గణేశ్ చౌక్ సెంటర్‌లోని పూజాగణపతి కుమారస్వామి ఆలయం వద్ద మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 7న వినాయక చవితిని పురస్కరించుకుని అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పట్టణ ఎస్సై శోభన్‌కుమార్ మాట్లాడుతూ వినాయక చవితి పందిళ్లు, మైక్ సిస్టం, విద్యుత్ లైటింగ్ వేసేటపుడు విధి విధానాలు పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

చాగల్లు: వినాయక చవితి వేడుకలు నిర్వహించే ఉత్సవ కమిటీలు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని చాగల్లు ఎస్సై కె.నరేంద్ర పేర్కొన్నారు. మండలంలోని గణపతి ఉత్సవ కమిటీల నిర్వాహకులతో మంగళవారం ఆయన చాగల్లులో సమావేశమయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో రాత్రివేళ అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఊరేగింపులు, నిమజ్జనాల తేదీలను పోలీసు స్టేషన్‌లో ముందుగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జుట్టా కొండలరావు, పిండి మంగరాజు, జెట్టి రామకృష్ణ , పలు గ్రామాల ఉత్సవ కమిటీల నిర్వహకులు పాల్గొన్నారు.

8 వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

40 డ్రమ్ములతో భూమిలో భద్రపరిచిన సారా తయారీదారు



భూమిలో పాతిపెట్టిన డ్రమ్ములోని బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్సై, పోలీసు సిబ్బంది



తాళ్లపూడి పోలీస్ స్టేషన్ వద్ద స్వాధీన చేసుకున్న ఇనుప డ్రమ్ములు

తాళ్లపూడి: మండలంలోని సూరయ్యపేట శివారు, తాడిపూడి కాలువ గట్టు ప్రాంతంలో నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రంపై మంగళవారం తాళ్లపూడి పోలీసులు దాడి చేశారు. స్థానిక ఎస్సై కె.రామకృష్ణ సారథ్యంలో నిర్వహించిన ఈ దాడిలో పొలంలోని భూమిలో పాతిపెట్టిన సారా తయారీకి వాడే బెల్లపు ఊట డ్రమ్ములను పోలీసులు గుర్తించి, ధ్వంసం చేశారు. ఒక్కో డ్రమ్ములో 200 లీటర్ల చొప్పున మొత్తం 40 ఇనుప డ్రమ్ముల్లో 8 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని ఎస్సై తెలిపారు. ఆ ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు జరిపి, భారీ డంప్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సారా తయారీదారులు ఎవరన్నది తెలియాల్సి ఉందన్నారు.

డిమాండ్ల సాధనకు ఆశా వర్కర్ల ఆందోళన



తాళ్లపూడి పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు



దేవరపల్లి మండలం యాదవోలు పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

తాళ్లపూడి: తమ డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ, కోల్‌కతా ఘటనను నిరసిస్తూ మంగళవారం తాళ్లపూడి పీహెచ్‌సీ వద్ద మండలంలోని ఆశా వర్కర్లు ఆందోళన చేశారు. సీఐటీయూ అనుబంధ సంస్థ అయిన ఏపీ స్టేట్ ఆశా వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు వారీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆ పీహెచ్‌సీ డాక్టర్ హారికాగుప్తాకు అందజేశారు. ఆందోళనలో ఆశా వర్కర్లు ఎ. రాఘవ, కె.సుధారాణి, విజయకుమారి, సునీత, పోశమ్మ, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి మండలంలో..

దేవరపల్లి: వేతనాలు పెంచి, ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద మంగళవారం ఆశా వర్కర్లు ధర్నా చేశారు. మండలంలోని దేవరపల్లి, యాదవోలు, గౌరీపట్నం పీహెచ్‌సీల వద్ద ధర్నా నిర్వహించి వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు యూనియన్ ప్రతినిధులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల మేరకు తాత్కాలికంగా నిలుపుదల చేసిన జీఓలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షురాలు మల్లిపూడి వెంకటలక్ష్మి, పి.లక్ష్మీప్రసన్న, టి. ఇందిర, ఎస్. ప్రసన్న, ఎస్‌జే హస్సీ, ఎం. ఆదిలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.రత్నాజీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పారిశుద్ధ్యం మెరుగు పరచాలి

తాళ్లపూడి: ఆసుపత్రిలో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు సూచించారు. మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, ఆశావర్కర్ల సమావేశంలో పాల్గొని ఎంపీపీ వారికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించాలని తెలిపారు. అలాగే తాళ్లపూడి పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్ల, వైద్య సిబ్బంది సమావేశాన్ని డాక్టర్ హారికా గుప్త అధ్యక్షతన నిర్వహించారు.



మలకపల్లి సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు

వరద బాధితులకు ఆహారం ప్యాకెట్లు



నల్లజర్లలో ఆహారం ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తహసీల్దార్



దేవరపల్లిలో జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి. చిత్రంలో వీఆర్వోలు



వేలివెన్ను శశి క్యాంపస్‌లో ఆహార పదార్థాల వాహనాలను ప్రారంభిస్తున్న చైర్మన్ రవికుమార్



కొవ్వూరు నియోజకవర్గ వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



నిడదవోలు నుంచి విజయవాడ వెళుతున్న పారిశుధ్య కార్మికులు

నల్లజర్ల: విజయవాడ వరద బాధితుల ఆకలి తీర్చేందుకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నల్లజర్లలో మంగళవారం వంటలు చేయించి, ఆహారాన్ని ప్యాకింగ్ చేయించి, ఆ ప్యాకెట్లను ఇక్కడి నుంచి పంపించారు. ఈ ఏర్పాట్లను కొవ్వూరు సబ్ కలెక్టరు అశుతోష్ శ్రీవాస్తవ పరిశీలించారు. కలెక్టరు ఆదేశాల మేరకు ఇక్కడ నుంచి 2,500 వెజిటబుల్ బిర్యానీ ప్యాకెట్లు సిద్ధం చేసి విజయవాడకు పంపినట్టు తహసీల్దార్ కృష్ణారావు తెలిపారు.వీఆర్వో లక్ష్మణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి నుంచి మరో 2,500 ప్యాకెట్లు

దేవరపల్లి: విజయవాడలో వరద నీటిలో చిక్కుకుని అలమటిస్తున్న వరద బాధితుల ఆకలి తీర్చేందుకు మండల రెవెన్యూ అధికారులు ముందుకు వచ్చారు. తమ వంతు సాయంగా వారు మంగళవారం 2,500 ఆహార పొట్లాలను తయారు చేయించి పంపించారు. ఆహార పొట్లాలు తీసుకువెళుతున్న వాహనాన్ని తహసీల్దార్ ఆఫీసు వద్ద తహసీల్దార్ కె. రాజ్యలక్ష్మి జెండా ఊపి పంపించారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ డి. వెంకటేష్, వీర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం నుంచి..

గోపాలపురం: విజయవాడ వరద బాధితుల ఆకలి తీర్చేందుకు స్థానిక తహసీల్దార్ పి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది మంగళవారం ఆహార పొట్లాలు తరలించారు. తహసీల్దార్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ సుమారు 2,500 మంది వరద బాధితులకు సరిపడా ఆహార పదార్థాలను, తాగునీటిని తరలించామన్నారు. ఆహారం తయారీ కార్యక్రమాన్ని కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పర్యవేక్షించారు.

శశి విద్యాసంస్థ నుంచి 10 వేల మందికి..

ఉండ్రాజవరం: విజయవాడ వరద బాధితుల కోసం మండలంలోని వేలివెన్ను శశి విద్యా సంస్థల నుంచి మంగళవారం ఆహారం, తాగునీరు పంపించారు. సుమారు 10 వేల మందికి సరిపడా బిర్యానీ, బ్రెడ్, పాలు, బిస్కెట్లు, తాగునీటి ప్యాకెట్లను రెండు వాహనాల్లో విజయవాడ పంపినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. ఆహార పదార్థాలతో కూడిన వాహనాలను విద్యాసంస్థ ఆవరణలో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, బూరుగుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం నియోజకవర్గం నుంచి 9 వేల ఆహార పొట్లాలు, 20 వేల వాటర్ బాటిళ్లు, 10 వేల వాటర్ ప్యాకెట్లను మంగళవారం పంపామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. రెవెన్యూ శాఖ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, త్రివేణి గ్లాస్ ఇండస్ట్రీస్–2, బొల్లిన శివ నాగేంద్ర ఆర్థిక సహకారంతో వీటిని సమకూర్చామన్నారు. విజయవాడ తరలిస్తున్న రెండు వాహనాలకు ఐ.పంగిడి గ్రామంలో ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు.టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ,కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయం నుంచి విజయవాడలోని వరద బాధితుల కోసం 5 వేల పులిహోర ప్యాకెట్లను మంగళవారం తరలించినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ పర్యవేక్షణలో ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో ఈ ప్యాకెట్లు సిద్ధం చేసినట్టు వివరించారు.

పారిశుధ్య విధులకు 30 మంది సిబ్బంది..

నిడదవోలు: వరద ముంచెత్తిన విజయవాడలో శానిటేషన్ పనుల నిమిత్తం 30 మంది నిడదవోలు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మంగళవారం ఆ నగరానికి తరలి వెళ్లారు. వారు ఇక్కడి నుంచే బ్లీచింగ్, ముగ్గు తాగునీటిని తీసుకువెళ్లారు. పారిశుధ్య సిబ్బందితో పాటు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, మున్సిపల్ డీఈఈ మాధవి, శానిటరీ మేస్త్రులు కూడా వెళ్లారు.వారంతా విజయవాడ ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తారు.

200 మందికి 'వాసవీ' వైద్య సేవలు



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న ఈఎన్‌టీ వైద్య నిపుణుడు ఉదయ చాణుక్య

కొవ్వూరు: వాసవీ క్లబ్ కొవ్వూరుశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శ్వాసకోశ, ఊపిరితిత్తులు, చెవి,ముక్కు,గొంతు, సాధారణ, స్త్రీ సంబంధిత, పిల్లల వ్యాధులకు సుమారు 200 మందికి వైద్య సేవలు అందించారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్.రవిచంద్రన్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. రాజమహేంద్రవరం శ్రీనిత్య క్లినిక్‌కు చెందిన ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు ఎస్‌వీవీ పాపారావు, ఈఎన్‌టీ వైద్య నిపుణుడు సామవేదం ఉదయచాణుక్య, శ్రీసీతారామ పోలీ క్లినిక్ నుంచి పిల్లల వైద్య నిపుణురాలు ఎల్‌కే మహాలక్ష్మి రోగులకు సేవలు అందించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు దేవతు కృష్ణప్రసాద్, కార్యదర్శి రాఘవ రమాకాంత్, కోశాధికారి సత్యవరపు గురునాథ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, వాసవీ క్లబ్ గెలక్సీ చైర్మన్ మద్దుల వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు

వాసవీ క్లబ్ కొవ్వూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సత్యవరపు గోపాలకృష్ణ, కొల్లేపర వెంకటేశ్వరరావు (శ్రీను) ఆర్థిక సహకారంలో సుబ్రహ్మణ్యేశ్వర హిందూ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలకు వాటర్ కూలింగ్ ఫ్రిజ్ అందజేశారు.ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందించారు.